

పోలీసుల గస్తీ ఉండాలి

రోగులకు చికిత్స అందించే విషయంలో వైద్యులకు పలు ఆటంకాలు ఎదురవుతున్నాయి. మద్యం సేవించి వస్తున్న రోగుల సహాయకుల వల్ల తీవ్ర అసౌకర్యంగా ఉంటుంది.ముఖ్యంగా రాత్రి సమయంలో ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందిస్తున్న సిబ్బందికి రక్షణకు అన్ని చర్యలు చేపట్టాలి. ఆ ప్రాంతంలో నిరంతరం పోలీసుల గస్తీ ఉండేలా చూడాలి. ఇటీవల వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార, ఘటన యావత్ భారతదేశాన్ని తలదించుకునేలా చేసింది. నిందితులను కఠినంగా శిక్షించాలి.అందుకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు తేవాలి.

–డాక్టర్ మానస, వైద్యాధికారి, యూపీహెచ్‌సీ సిద్ధేశ్వరం



సామాజిక అవగాహన అవసరం



రోగుల ప్రాణాలు కాపాడాలన్న సదుద్దేశంతో సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బందికి దాడుల నుంచి భద్రత లభించాలి. దీనికి సామాజిక అవగాహన అవసరం..ఆడ, మగ పిల్లలకు చిన్నతనం నుంచే బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లతో పాటు సెక్స్ ఎడ్యుకేషన్‌ను అందించాలి. అప్పుడు అత్యాచారాలు అరికట్టడానికి కొంతమేర అవకాశం ఉంటుంది.వైద్యులు, వైద్య సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తిస్తే పడే శిక్షలకు సంబంధించిన వివరాలతో కూడిన బోర్డులను ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాల సంఖ్య పెంచాలి.

–డాక్టర్ రమేష్‌బాబు, వైద్యాధికారి పీహెచ్‌సీ పెదగంట్యాడ

క్లుప్తంగా

నిత్యావసర సరకుల వితరణ



యల్లయ్య తల్లికి నిత్యావసరాలు అందజేస్తున్న బట్టు పైడిరెడ్డి

పెదగంట్యాడ: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని 77వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని మరడ దానరిపేటకు చెందిన ధర్మాల యల్లయ్య రెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో యల్లయ్య రెడ్డి కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు తాతారావు, వెంకటరెడ్డి, తాతనాయుడు, నాగిరెడ్డి,ఆర్. పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక కమిటీని రద్దు చేయాలి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ పేరుతో అనధికారికంగా తిష్ట వేస్తున్న వ్యక్తులను కట్టడి చేయాలని అగనంపూడి నిర్వాసిత కాలనీల నాయకులు మోటూరి వెంకటరమణ, పట్టా రామ అప్పారావు కోరారు. ఆలయానికి విరాళాలు, హుండీ, పండగల సందర్భంగా కానుకల ద్వారా వచ్చే ఆదాయాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడాలని జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్లను కోరారు. కమిటీల పేరుతో వసూళ్లు చేస్తున్న నిధులకు లెక్కలు సరిగా లేవన్నారు. దేవుడి సొమ్ము పరులపరం కాకుండా కాపాడాలని వారు కోరారు.

సీజీఎం శ్రీధర్‌కు అభినందనలు



స్టీల్‌ప్లాంట్ నూతన సీజీఎం శ్రీధర్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఉప్పలూరి శ్రీధర్‌ను స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు అభినందించారు. నూతన సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం అసోసియేషన్ నాయకులు తిప్పల చక్రధర్‌రెడ్డి, పి. అప్పలనాయుడులు ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని సీజీఎం కార్యాలయంలో శ్రీధర్‌ను కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వారు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

బ్లాస్ట్‌ఫర్నేస్ హెచ్‌వోడీకి సత్కారం



నూతన విభాగాధిపతి రెడ్డిని సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగాధిపతి బీఏకే రెడ్డిని శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులు సత్కరించారు. విభాగాధిపతిగా నియమితులైన సందర్భంగా ఆయన్ను కలిసి అభినందించారు. సీనియర్ నాయకులు పి.వి. నగేష్, విభాగ కమిటీ అధ్యక్షుడు పోలీసు నాయుడు, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ

మురళీనగర్ : మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ఈ నెల 28 నుంచి ఉచితంగా పెయింటింగ్‌లో శిక్షణ నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి తెలిపారు. డిజైనర్ పెయింటింగు ఆన్ బ్లౌజెస్, పూజలకు ఉపయోగించే కర్టెన్స్‌పై బ్యాక్ డ్రాప్ పెయింటింగు, గ్లాస్ పెయింటింగుపై కె.హిమబిందు శిక్షణ ఇస్తారని చెప్పారు. బిర్లా కూడలి అభిరుచి స్వీట్స్ సమీపంలో ప్రతి రోజు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు.

శౌరా..

- చీపురుపుల్లలు..గడ్డివరకలతో అద్భుత కళాఖండాలు
- దత్తసాయినగర్‌కు చెందిన సురేష్ ప్రతిభ



శిక్షణ ఇస్తున్న సురేష్

కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ల... కాదేదీ కవితకు అనర్హం అన్నాడో మహాకవి. చీపురుపుల్ల, వరిగడ్డి కళాఖండాలకు అర్హమే అని నిరూపించాడు గాజువాక దత్తసాయినగర్‌కు చెందిన నాయిన సురేష్. బీకాం వరకు చదివి ఓ ప్రైవేట్ స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తున్న సురేష్ అందరూ చులకనగా చూసే చీపురు పుల్లలు, వరిగడ్డితో అద్భుతమైన కళాఖండాలు సృష్టించి శౌరా అనిపిస్తున్నాడు. ప్రశంసలు అందుకుంటున్నాడు.



సురేష్ రూపొందించిన కళాకృతుల్లో కొన్ని..






గాజువాక: అతడి చేతిలో చీపురు పుల్లలు కళాఖండాలుగా అమరిపోతాయి. వరిగడ్డి పరకలు సైతం ఒదిగిపోయి అద్భుత కళాకృతులు ఆవిష్కృతమవుతాయి. సురేష్ తీర్చిదిద్దే చిత్రాలకు చీపురుపుల్లలు, వరిగడ్డి కీలక భూమిక పోషిస్తాయి.

150కి పైగా కళాఖండాలు

కళలపై మక్కువ ఉన్న సురేష్ ఒకరోజు ఇంట్లోని చీపురు పుల్లలతో తాజ్‌మహల్ సెట్ తయారు చేశాడు. అది చూసిన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు 'నీలో మంచి కళాకారుడున్నాడ'ని ప్రోత్సహించడంతో చిత్రకళకు పదును పెట్టాడు.



వరిగడ్డితో..



శ్రీరామ పట్టాభిషేకం, నటులు, దేశ నాయకులు, రాజకీయ నాయకుల చిత్రాలు, మదర్ థెరిసా, స్వామి వివేకానంద, గౌతమ బుద్ధుడు, రవీంద్రనాథ్ ఠాగూర్, జవహర్‌లాల్ నెహ్రూ, భారతరత్న డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలామ్.. ఇలా వందల సంఖ్యలో కళాఖండాలకు వరిగడ్డితో జీవం పోశాడు.

చీపురుపుల్లలు, వరిగడ్డితో 150కి పైగా కళాఖండాలు తయారు చేశాడు.

చీపురు పుల్లలతో ఎన్నో చిత్రాలు

చీపురు పుల్లలతో తాజ్‌మహల్, చార్మినార్, వృక్ష గణపతి, గర్భస్థ శిశువు, రాధాకృష్ణులు, ఓంకార నాదం, పల్లకిలో పెళ్లికూతురు, నందీశ్వరుడు, పల్లెవాతావరణం, కృష్ణవేణి, దేవతామూర్తులు, ప్రకృతి, వాతావరణం, కార్టూన్లు, క్యారికేచర్లు తీర్చిదిద్దాడు.

కళాకృతుల తయారీ ఇలా..



సురేష్ మాటల్లో చెప్పాలంటే.. కావాల్సిన కళారూపాన్ని ముందుగా స్కెచ్ వేసుకోవాలి. చీపురుపుల్లలనుగాని, వరిగడ్డిని గాని రెండుగా చీల్చి ఒకదాని పక్కన మరోదాన్ని జిగురుతో అంటించి ఓ ఆకారాన్ని తయారు చేయాలి. తగిన రంగు గల వాల్వెట్ పేపరుపై దాన్ని అతికించుకోవాలి. చిన్న చిన్న ముక్కలను అతికించి మనం అనుకున్న కళారూపాన్ని తయారు చేయాలి. చెక్క, అట్టను, థర్మాకోల్ షీట్‌నుగాని తీసుకొని కళారూపాన్ని దానిమీద అంటించాలి. అది పాడవకుండా ఉండటానికి పాలిథిన్ కవరు వేసి భద్రపరచాలి. ఒక్కొక్క కళారూపం తయారు చేయడానికి 6 నుంచి సుమారు 50 గంటల వరకు సమయం పడుతుందని తెలిపాడు.

అవార్డుల పరంపర



చీపురుపుల్లలు, వరిగడ్డితో సృజనాత్మక కళాఖండాలు సృష్టిస్తున్న సురేష్‌కు అవార్డులు చాలానే వచ్చాయి. 2004లో లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి చిత్ర కళాప్రదర్శనలో కళాపురస్కార్ లభించింది. 2005లో భద్రాచలంలో ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ద్వారా కళాశ్రీ అవార్డు అందుకున్నాడు. హైదరాబాద్, తిరుపతి, అమలాపురం ప్రదర్శనల్లో ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాలు స్వీకరించారు. రాష్ట్రంలో చిత్రకళా ప్రదర్శనలు ఎక్కడ ఏర్పాటు చేసినా అక్కడ సురేష్ కళాఖండాలు ఉంటాయి. మరిన్ని కళాఖండాలను తయారుచేసి జాతీయస్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నదే తన లక్ష్యమని సురేష్ పేర్కొన్నాడు. సెలవు రోజుల్లో ఔత్సాహికులకు తమ ఇంటివద్ద ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపాడు.

14న మెగా లోక్ అదాలత్



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు

గాజువాక: సుప్రీం కోర్టు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు వచ్చేనెల 14న గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 13వ అదనపు జిల్లా జడ్జి జె.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక అదనపు జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అదాలత్లో అన్ని రకాల బ్యాంకు కేసులు, భూతగాదా కేసులు, రెవెన్యూ, కార్మిక, కుటుంబ తగాదాలు, మోటారు ప్రమాదాల్లో పరిహారానికి సంబంధించిన కేసులు, ఇన్సూరెన్స్, విద్యుత్, నీరు, టెలిఫోన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, పి.ప్రదీప, ఏసీపీ త్రినాథ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు సదస్సులు దోహదం



సీఈవో శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి పెరగడానికి, నూతన ఆవిష్కరణలకు సదస్సులు దోహదపడతాయని ఫ్యూట్ గ్లోబల్ సీఈవో శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఒక స్పష్టమైన అంశం, పాఠ్యాంశంపై పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పడాలంటే ఇటువంటి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కొత్త ఆలోచనలకు అవకాశం ఏర్పడి, విద్యార్థుల జీవితాలను మలుపు తిప్పుతాయన్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం తద్వారా కొత్త ఆవిష్కరణలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీసీఐఎస్ అధిపతి ఎ.సంపత్ దక్షిణమూర్తి, కార్యక్రమ సమన్వయకర్త భరత్ కుమార్, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని గురజాడ కళాక్షేత్రంలో సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకటరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ లేబర్ గేటు వద్ద శనివారం కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం సహాయ నిరాకరణకు పాల్పడడం శాపంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ప్లాంట్ పునరుజ్జీవనానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మేళనంలో భాగంగా నగరంలో సరస్వతీ పార్కు నుంచి సెంట్రల్ పార్కు వరకు జరిగే కార్మిక ప్రదర్శనలో పాల్గొవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘం నాయకులు ఎల్లేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: వచ్చేనెల 1వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉక్కునగరంలో నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల పోస్టర్‌ను ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశాలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 370 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. సమావేశాల ముగింపు సందర్భంగా 3వ తేదీన నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణ, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వరంగంలోనే కొనసాగించడంతోపాటు కంపెనీకి ఐరన్‌ఓర్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ సమావేశాల్లో తీర్మానాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజబాబు, జి.ఆనంద్, తాండ్ర కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుక



భాస్కర్ విద్యానికేతన్‌లో వేషధారణల్లో చిన్నారులు



రవీంద్ర భారతి స్కూల్‌లో చిన్నారుల సందడి

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుడు, కుచేలుడు తదితర వేషధారణల్లో శ్రీకృష్ణ లీలల పాటలు, కోలాటాలతో సందడి చేశారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాలవలస భాస్కరరావు, ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు విశేషంగా అలరించాయి. చిన్నారులతో ఉపాధ్యాయులు ఉట్టి కొట్టించి సంబరాలు జరిపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత శ్రీకృష్ణ జన్మాష్టమి ఔన్నత్యాన్ని వివరించారు.

పెర్క్స్ సర్క్యులర్ ఉప సంహరించాల్సిందే..



అధికారులతో మాట్లాడుతున్న సీజీఎం శ్రీధర్

ఉక్కు అధికారుల సంఘ నాయకుల డిమాండ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారుల పెర్క్స్ తగ్గిస్తూ యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ఉక్కు అధికారులు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద శనివారం నిరసన తెలిపారు. అనంతరం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. 2007 నుంచి వేతన ఒప్పందం తర్వాత అధికారులకు పెద్ద మొత్తంలో పెన్షన్ ఫండ్ బకాయిలు, 2011లో పీఆర్పీ చెల్లించే సమయంలో అన్యాయంగా కోత విధించిన ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఐదేళ్లుగా పదోన్నతులు ఇవ్వకపోవడం వల్ల కోల్పోయిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఐదు నెలలుగా నిలిపేసిన పీఎఫ్, గ్రాట్యూటీ బకాయిలు, అధిక మొత్తంలో కరెంటు చార్జీలు, చనిపోయిన అధికారుల కుటుంబాలకు ఇవ్వాల్సిన ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ చెల్లింపులు, త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు అన్నీ కలిపి సుమారు రూ. 2400 కోట్లకు పైగా ఉక్కు యాజమాన్యం బకాయి పడిందన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం వల్ల డిఫాల్టర్లుగా మారుతున్నామన్నారు. ఈ పరిణామాల వల్ల సుమారు 300 మంది యువ అధికారులు రాజీనామా చేసి వెళ్లిపోయారన్నారు. కాంట్రాక్టు కార్మికుల బయోమెట్రిక్ హాజరు అంశంపై సుమారు 200 మందికి పైగా షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. ఈ సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ యాజమాన్యంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలకు హాజరైన రోగులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక లయన్స్ క్లబ్, విశాఖ డిస్టలరీస్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్, విజన్ ట్రీ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖ డిస్టలరీస్ ఎల్ఎల్‌పీ అధినేత లయన్ సున్న శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుందరయ్య పేట, నర్సీపట్నం రోడ్డులోని ఫ్యాక్టరీలో నిర్వహించిన శిబిరంలో 400 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. గుర్తించిన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తామని సున్న శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శేషు ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు లయన్ సత్యాల కోటేశ్వరరావు, కార్యదర్శి పలిశెట్టి లక్ష్మణ్, కోశాధికారి బలివాడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారికి సహస్ర నామార్చన



విశేష అలంకరణలో వెంకన్న

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ దరి ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా శనివారం దివ్యక్షేత్రంలో వేకువ జాము నుంచే తోమాల సేవ, సుప్రభాత సేవలు జరిపారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి సహస్రనామార్చన నిర్వహించారు. విశేష అలంకరణలో స్వామి భక్తులకు దర్శన మిచ్చారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

రైల్వే స్టేషన్‌లో గంజాయి సీజ్



పట్టుబడ్డ యువకులతో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సుమారు రూ. 88 వేలు ఖరీదు చేసే గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది రైల్వే స్టేషన్‌లో గల వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహిస్తుండగా మాలప్పురం, కేరళకు చెందిన అబ్దుల్ మాలిక్, మహ్మద్ ముస్ఫిర్, మహ్మద్ ఫాజిల్ అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో చేసిన దాడుల్లో ఆర్పీఎఫ్ ఎస్ఐ అభిషేక్ మిస్త్రీ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేష్

పెదగంట్యాడ: హిందూజా పవర్ ప్లాంట్‌కు సంబంధించిన యాష్ పాండ్ నుంచి వచ్చే దుమ్ము, ధూళి నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పాలవలస ప్రాంతంలోని హిందూజా పవర్‌ప్లాంట్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాలవలస, దేవాడ, నమ్మిదొడ్డికి చెందిన వారితో మాట్లాడారు. హిందూజా పవర్ ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్టీపీసీ, హిందూజా యాజమాన్యాలతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. హిందూజా పవర్ ప్లాంట్ యాష్ పాండ్ కారణంగా వాతావరణం కలుషితమైందని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన పవర్ ప్లాంట్‌కు రైల్వే లైన్ వేస్తే కాలుష్యం సమస్య తగ్గుతుందని, దీని కోసం కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. ఎంపీకి సమస్యలు వివరించిన వారిలో కాకి బాబు, నక్కా శ్రీనివాసు తదితరులు ఉన్నారు.